
సాక్షి
వనపర్తి
శుక్రవారం । 12 । మే । 2023



ఆదమరిస్తే అంతే..

మహబూబ్‌నగర్– చించోలి రహదారిపై సాగుతున్న పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

వివరాలు 10లో ▸



నిందితుల రిమాండ్

సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.2 /26.4

వాతావరణం

ఉదయం ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఉంటుంది.

పాలన.. గాడిన...!

సమయపాలనపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- అధికారులు, సిబ్బందితో పాటే బయోమెట్రిక్ హాజరు
- ఉత్తమ సేవలందిస్తున్న వారికి సన్మానం
- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణి నిర్వహణ
- ఈ–ఆఫీస్ అమలుకు చర్యలు



కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు వేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: జిల్లా పరిపాలనను గాడిలో పెట్టేందుకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తనదైన శైలిలో వినూత్న ప్రయత్నాలకు శ్రీకారం చుడుతున్నారు. క్షేత్ర పర్యటనలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూనే.. ఆయా శాఖల అధికారులు విధులపై దృష్టి సారించేలా, పాలనలో తనతో పాటు అధికారులు, సిబ్బందిని భాగస్వామ్యం చేసే దిశగా సున్నితంగా హెచ్చరిస్తూనే.. అవసరమైన చోట భేష్ అంటూ కితాబులిస్తూ విధి నిర్వహణలో నీరసించిన వారిని ప్రోత్సహిస్తున్నారు.

పకడ్బందీగా బయోమెట్రిక్ నమోదు..

43 శాఖల కార్యాలయాలున్న సమీకృత కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు పనివేళల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేందుకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మే నెల ప్రారంభం నుంచి అన్నిశాఖల అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరును కలెక్టర్ నిత్యం పరిశీలిస్తూ.. సమయపాలన పాటించని వారికి గైర్హాజర్ వేస్తున్నారు. తగిన సంజాయిషీ ఇస్తేనే మినహాయింపు ఇచ్చేలా ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. కలెక్టరేట్‌లోని కార్యాలయాల్లో సాయంత్రం అయిదు గంటల వరకు సిబ్బంది కనిపిస్తున్నారంటే మార్పు కనిపిస్తోంది.

స్వయంగా హాజరు వేస్తూ..

కలెక్టర్ రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు వేస్తూ అధికారులు, సిబ్బంది కూడా సకాలంలో కార్యాలయానికి రావాలని సూచించటం చెప్పుకోదగ్గ మార్పు.

ఉత్తమ సేవలకు సన్మానం..

ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి వేదికగా ఉత్తమ సేవలు అందించే అధికారుల్లో వారానికి ఒకరు చొప్పున ఎంపిక చేసి సన్మానం చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. ఇందుకు అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే ప్రజావాణి నుంచి ఈ కార్యక్రమం అమలు చేయనున్నట్లు ఇటీవల ఆయనే స్వయంగా ప్రకటించారు.

ప్రజావాణిపై పెరిగిన భరోసా..

కలెక్టరేట్ ప్రజావాణిపై జనానికి భరోసా పెరిగింది. కొన్ని వారాలుగా ప్రజావాణి అర్జీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. సోమవారం దాఖలైన అర్జీని వారంలోగా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపడం, సమస్యలను ఓపిగ్గా వినటంతో పాటు ప్రజావాణి జరిగే సమయం వరకు అన్ని మండలాల అధికారులు జూమ్‌లో కలెక్టర్‌కు అందుబాటులో ఉండటం, ప్రజల ఎదుటే వారితో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేయటంతో ప్రజల్లో నమ్మకం పెరిగినట్లు తెలుస్తోంది.

స్పష్టమైన మార్పు వచ్చింది



జిల్లా పరిపాలనలో స్పష్టమైన మార్పు వచ్చింది. ప్రజావాణి అర్జీల పరిష్కారం, ఆయా ప్రభుత్వశాఖల పనితీరు, విధినిర్వాహణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. బయోమెట్రిక్ హాజరు నిబంధనలు స్వయంగా తాను పాటిస్తూ.. అధికారులను పాటించాలని ఆదేశించారు. రోజువారి హాజరును కలెక్టర్ రోజుకు రెండుసార్లు పరిశీలిస్తారు. ఆమోదయోగ్యమైన కారణాలున్న వారికి మినహాయింపు ఇస్తూ.. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి వేతనంలో కోత తప్పేలా లేదు.

– రాజేందర్‌గౌడ్,
ఏఓ, కలెక్టరేట్, వనపర్తి

ఈ–ఆఫీస్ అమలుకు చర్యలు..

మూడేళ్లుగా మరుగునపడిన ఈ– ఆఫీస్‌ను తిరిగి అమలు చేసేందుకు చొరవ చూపుతున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు. అతి త్వరలో ఈ–ఆఫీస్ అమలవుతున్న జిల్లాల వరుసలో వనపర్తి పేరును చేర్చేందుకు కలెక్టర్ కృషి చేస్తున్నారు.

ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలి

- డీఎంహెచ్‌ఓ రవిశంకర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రవిశంకర్

వనపర్తి: ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, తీసుకునే ఆహారంతోనే.. ఆరోగ్యంలో మార్పులు చోటు చేసుకుంటాయని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. గురువారం హాట్‌ఫుల్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆయాశాఖల ఉద్యోగులకు ఎన్‌సీడీ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కలెక్టర్ సూచన మేరకు జిల్లాలోని ఉద్యోగులందరికీ.. వైద్యపరీక్షలు చేయాలని కోరారు. అనంతర్ హాట్‌ఫుల్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ ఆంజనేయులు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ.. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఆహారం తీసుకోవటంపై సూచనలు చేశారు. యోగా చేయటం వలన కలిగే లాభాలు వివరించారు. జీవన విధానంలో మార్పు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిశంకర్, ఆర్డీఓ పద్మావతి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల కుటుంబాన్ని ఆదుకోవాలి



తాటిపాములలో మృతుల కుటుంబ సభ్యులతో మల్లు రవి

పెబ్బేరు రూరల్: దుస్తులు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన ముగ్గురు బాలికల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, పరిహారం అందేలా చూడాలని మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి డిమాండ్ చేశారు. గురువారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, స్థానిక నాయకులతో కలసి పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని, ఆ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున సాయం అందించేలా చూడాలని మంత్రి నిరంజన్‌రెడ్డిని కోరారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ మృతుల కుటుంబానికి త్వరగా ప్రభుత్వం నుంచి నగదు సహాయంతో పాటు ఇంట్లో ఒక్కరికి మల్టీపర్పస్ వర్కర్‌గా నియమించాలని, 200 గజాల ప్లాట్, దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇల్లు అందేలా చూడాలన్నారు.

జేపీఎస్‌ల సమ్మె న్యాయబద్ధం

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె న్యాయ బద్ధమైనదని, వారు అన్ని అనుమతులతో పాటు, పరీక్షలు రాసి ఎంపికయ్యారని, అయినా వారికి కేవలం బాధ్యతలేనా హక్కులు ఉండవా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వానికి ముందుగా సమ్మె నోటీస్ ఇచ్చినా పట్టించుకోలేదని, వెంటనే వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఇక అకాల వర్షాల నేపథ్యంలో వరి, మొక్కజొన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు రంజిత్, శ్రీనివాస్‌గౌడ్, వాసుదేవారెడ్డి , మద్దిలేటి, సాయిప్రకాష్ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టనుందని, లబ్ధిదారుల వాటా చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ నాయకులు కురుమూర్తి యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని చిమనగుంటపల్లిలో యాదవులను కలిసి రెండో విడత గొర్రెల పంపిణీ విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి యాదవ్, భగవంతు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీయూకు సెలవులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి ఈనెల 13 నుంచి జూన్ 1వ తేదీ వరకు సెలవులు ఇస్తున్నట్లు పీయూ రిజిస్ట్రార్ గిరిజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పీయూ అనుబంధ పీజీ కళాశాలల్లో కూడా సెలవులు ఉంటాయని, 13వ తేదీన నుంచి పీయూలోని హాస్టళ్లు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,410

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో గురువారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,410, కనిష్టంగా రూ.4,300ధరలు లభించాయి. మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.1,839, కనిష్టంగా రూ.1,499, ఆముదాలు గరిష్టంగా రూ.5,567, కనిష్టంగా రూ.5,350, హంస రకం గరిష్టంగా రూ.1,769, కనిష్టంగా రూ.1,337, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,402, కనిష్టంగా రూ.1,305, సజ్జలు రూ.2,300 ధరలు లభించాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,079, కనిష్టంగా రూ.1,603గా నమోదయ్యాయి. హంస ధాన్యం గరిష్టంగా రూ.1,509, కనిష్టంగా రూ.1,401, ఆముదాలు గరిష్టంగా రూ.5,379గా ధరలు లభించాయి. మార్కెట్‌కు రెండు వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ప్రైవేట్ కళాశాలల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఏఐఈఈఈ, ఎంసెట్ కోచింగ్ ఇచ్చేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 15లోగా ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

16 నుంచి సదరం క్యాంపులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వికలత్వ పరీక్షలు నిర్వహించే సదరం క్యాంపులు ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ యాదయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం ఆర్థోపెటిక్ పరీక్షలు, ప్రతి బుధవారం చెవుడు, అంధుల, మానసిక దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

ఖిల్లాఘనపురం: ఆటో, బైక్ ఎదురెదురుగా వస్తూ ప్రమాదవశాత్తు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి కాలు విరిగింది. ఈ ఘటన మండలంలోని సల్కెలాపూర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా.. అప్పారెడ్డిపల్లికి చెందిన పట్నం నాగరాజు పని నిమిత్తం గురువారం రాత్రి సల్కెలాపురం గ్రామానికి బైక్ మీద వెళ్తున్నాడు. ఈ సమయంలో సల్కెలాపురానికి చెందిన శివ తన ఆటోలో అప్పారెడ్డిపల్లికి వస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ కొత్తగొల్ల ఊషన్న వ్యవసాయ పొలం వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో పట్నం నాగరాజు కుడి కాలు విరిగింది. చికిత్స నిమిత్తం అతడిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.



రైతులను మోసం చేస్తే చర్యలు



కాంటాను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: తూనికలు, కొలతల విషయంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులను, కిరాణం షాపుల్లో వినియోగదారులను మోసం చేస్తే వారిపై చర్యలు తప్పవని తూనికలు, కొలతల జిల్లా అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రిక్ కాంటాలు, బాట్లను తనిఖీలు చేశారు. కొన్ని కేంద్రాల్లో తూకం చూసే విషయంలో కొంత మోసం జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందని వారికి జరిమానాతో పాటు వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దీంతోపాటు గ్రామ సమీపంలోని రైస్ మిల్లు దగ్గర వే బ్రిడ్జిని వారు పరిశీలించారు.

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

వనపర్తి: ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 15 నుంచి 17వ తేది వరకు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ రహెమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 15–36 ఏళ్ల మధ్య వయస్సు వారు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చని, ఈనెల 14వ తేదీలోగా అయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాని పేర్కొన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడలు నిర్వహించనున్నట్లు, ఫుట్‌బాల్ క్రీడకు మినహా.. మిగతా క్రీడల్లో మహిళలు పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్న వారు ఈ నెల 22వ తేది నుంచి 24వ తేది వరకు స్థానిక డాక్టర్ బాలకిష్టయ్య స్టేడియంలో పై ఐదుక్రీడలతో పాటు క్రీడాకారుల దరఖాస్తులను బట్టీ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, షార్ట్ పుట్, లాంగ్‌జంప్ తదితర క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 20వ తేది సాయంత్రం 5 గంటల్లోగా డీవైఎస్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- విద్యుత్ సరఫరాలో దేశానికి ఆదర్శం
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గద్వాల రూరల్: విద్యుత్ ప్రజలందరికి ఎంతో ముఖ్యమని అందులో రైతులకు మరింత ప్రధానమైనదని.. వ్యవసాయానికి 24గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, విద్యుత్ సరఫరాలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శక్తి మానవులకు మౌళిక వసతి మూలరూపమని, 16వేల మెగావాట్ల ఉత్పత్తి, వినియోగంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు. విద్యుత్తు సిబ్బంది చీకట్లో ఉంటూ మనకు వెలుగునిస్తున్నారు. భవిష్యత్తులో ప్రపంచానికి అన్నం పెట్టే శక్తి భారతదేశానికి ఉంటే అందులో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉంటుందన్నారు. విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్తు సరఫరా సేవలు భవిష్యత్తులో కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వీఎం అబ్రహం, ఢిల్లీలో అధికార ప్రతినిధి మందా జగన్నాథం, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

▶ బస్టాండు, సమీకృత మార్కెట్ నిర్మాణాలు పరిశీలన అదేవిధంగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణం, నూతన బస్టాండ్ నిర్మాణ పనులను మంత్రి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొందరికే మోదం..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్కీ డ్రాలో 543మందిని వరించిన అదృష్టం

- 853మంది అర్హులకు తప్పని నిరాశ
- పలు చోట్ల ఇళ్లు దక్కని పేదల నిరసనలు.. అధికారులతో వాగ్వాదం
- రాత్రి 9గంటల వరకు కొనసాగిన ఇళ్ల కేటాయింపు ప్రక్రియ



లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



లక్కీ డిప్‌లో పేరు రాలేదని కన్నీటి పర్యంతమవుతున్న మహిళలు



బీసీలకు రిజర్వేషన్ కేటాయించాలని నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకుడు

వనపర్తి టౌన్: వనపర్తి పురపాలిక పరిధిలో నివసిస్తున్న నిరుపేదలకు పెద్దగూడెం, రాజాపేట, పీర్లగుట్ట వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన లక్కీ డిప్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో దివ్యాంగుల, 25, 26 వార్డులకు చెందిన లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేపట్టారు. అనంతరం 33 వార్డులకు గాను 2,3 వార్డులకు మధ్యస్థంగా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో మండల, జిల్లా స్థాయి, పురపాలక అధికారులు అర్హుల సమక్షంలో మధ్యాహ్నం వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను లక్కీ డిప్ ద్వారా ప్రకటించారు. మొత్తం 1,401 మంది అర్హులకుగాను 543 మంది లబ్ధిదారులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేయడంతో 858 మంది అర్హులకు అవకాశం దక్కలేదు. ముందుగా అర్హుల జాబితాను చదివి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు రిజర్వేషన్‌ల ద్వారా ఎంపికైన తర్వాత ఓపెన్ కేటగిరిలో లబ్ధిదారులను లక్కీ డిప్ ద్వారా ప్రకటించారు. 33వార్డుల్లో 48 మంది దివ్యాంగులు అర్హులు ఉండగా 5శాతం రిజర్వేషన్‌తో 27 మందిని సెలెక్టు చేయగా మిగతా ఆరుగురు ఆయా వార్డుల్లో జరిగిన ఓపెన్ కేటగిరిలోని వికలాంగుల కోటాలో ఎంపిక కావడంతో మొత్తం 33మంది దివ్యాంగులకు డబుల్ ఇళ్లకు అర్హత సాధించారు. ఎస్సీలకు 17శాతం రిజర్వేషన్‌లో భాగంగా మొత్తం 171 మంది అర్హులు కాగా, రిజర్వేషన్, ఓపెన్ కాటగిరీలో 92 మంది ఎంపికయ్యారు. 6శాతం ఎస్టీ రిజర్వేషన్‌తో మొత్తం 35 అర్హులు ఉండగా లక్కీ డిప్ ద్వారా 33 మంది అదృష్టం వరించింది. మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్‌తో 326 మంది అర్హులు ఉండగా 65 మందికి లక్కు దక్కింది. ఓపెన్ కేటగిరిలో 869 మంది అర్హులకు గాను, 353 మందికి లక్కు దక్కింది.

నిరసన సెగలు

ఆయా వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అర్హుల్లో రిజర్వేషన్‌ల ఆధారంగా లబ్ధిదారులను లక్కీ డిప్ ద్వారా ప్రకటించారు. రిజర్వేషన్‌లో మిగిలిపోయిన అర్హులను ఓపెన్ కేటగిరిలో (అన్ని వర్గాలతో పాటుగా) కలిపి లక్కీ డిప్‌లో అవకాశం కల్పించి అర్హుల ఎంపిక చేపట్టారు. ఈ విషయం పై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వకపోవడంతో రిజర్వేషన్‌లో వేసిన వారి పేర్లను మళ్లీ ఓపెన్ కేటగిరిలో ఎలా వేస్తారని?, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఎలా కేటాయిస్తారని, బీసీలకు రిజర్వేషన్ ఇవ్వరా అని 3వ వార్డు కేంద్రం వద్ద అధికారులకు, అర్హుల మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. ఇదే క్రమంలో బీజేపీ నాయకులు పరశురాం తదితరులు అధికారుల తీరును తప్పుబడుతూ.. నిరసన వ్యక్తం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పోలీస్‌లు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. 5వ వార్డులో ఇళ్లు ఉన్నవారికే మళ్లీ వచ్చాయని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అలాగే, అర్హులు తమకు అవకాశం దక్కలేదని కన్నీటి పర్యాంతమవగా.. ఉద్యోగులకు, రాజకీయ పార్టీ నాయకులకు ఇళ్లు రావడంపై దుమారం చెలరేగింది. ప్రతి కేంద్రం వద్ద పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

రాత్రి వరకు ఇళ్ల కేటాయింపు

మధ్యాహ్నం వరకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసిన అర్హులను మధ్యాహ్నం 3గంటలకు ఆర్డీఓ కార్యాలయానికి పిలిపించారు. అర్హులైన లబ్ధిదారుల లిస్ట్ ఒకవైపు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రాంతాలు, మరో వైపు ఉంచి ఎంపికైన లబ్ధిదారుల పేరు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వచ్చిన ప్రాంతాన్ని, బ్లాక్‌ను, ఫ్లోర్‌ను, ఇంటి నంబర్ కేటాయింపు ప్రక్రియ రాత్రి 9గంటల వరకు కొనసాగింది. పీర్లగుట్టలో 244, పెద్దగూడెం శివారులో 238, రాజాపేట శివారులో నిర్మించిన 61 ఇళ్ల లక్కీ డిప్‌ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు కేటాయించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌తో పాటు మండల, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు భవిష్యత్తులో అవకాశం

వనపర్తి టౌన్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో లక్కీ డిప్‌లో ఎంపిక కానీ మిగిలిపోయిన అర్హులకు భవిష్యత్తులో ప్రభుత్వం ఏదైన అవకాశం కల్పిస్తే ప్రాధాన్యం కల్పిస్తామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఈ మేరకు గురువారం డబుల్ బెడ్‌రూం ఇల్ల కేటాయింపులో భాగంగా ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అర్హుల జాబితా మా వద్దే ఉంటుందని, ప్రభుత్వం భవిష్యత్తులో ఏం నిర్ణయం తీసుకున్నా ప్రస్తుతం మిగిలిపోయిన అర్హులకు అవకాశం కల్పిస్తామన్నారు. అంతకుముందు వార్డుల వారీగా డబుల్ బెడ్‌రూం లక్కీ డిప్ ఎంపిక కోసం నియమించిన జిల్లా, మండల స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వార్డులో అర్హుల జాబితాను చదివి వినిపించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్‌లతో పాటుగా ఓపెన్ కేటగిరిలో ఎంపిక చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరిగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంతోపాటుగా శ్రీనివాసపురం, దళితవాడలోని కర్రెమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేసిన లక్కీ డిప్ ఎంపిక ప్రక్రియను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు రైతు మృతి

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామ శివారులో పిడుగుపాటుకు అంబట్‌పల్లికి చెందిన రైతు దాసరి కృష్ణయ్య(60) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామ శివారులో తన సొంత పశువులను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం కురువడంతో తలదాచుకోవడానికి చెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, సర్పంచ్ రవిశంకర్ సంఘటన స్థలానికి చేరుకొని చూడగా రైతు విగతజీవిగా పడి ఉన్నాడు. మృతునికి భార్య బాల పీరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాచూరులో ఆవు..

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన చెట్ల అలివేలు అనే రైతుకు చెందిన పాడిఆవు పిడుగుపాటుకు గురై గురువారం మృతిచెందింది. గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో పాడి ఆవును రైతులు చెట్టుకింద కట్టేశారు. అక్కడే పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది. పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాడి ఆవు దాదాపుగా రూ.50వేలు ఉంటుందని రైతు పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మక్తల్: మండలంలోని కన్మనూర్‌కు చెందిన దొబ్బలి వెంకటయ్య(55) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెంటకయ్య మరో వ్యక్తితో కలిసి బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జక్లేర్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న బొలెరోను వెనక నుంచి ఢీకొట్టడంతో వెంకటయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం మొదట మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యు సలహా మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తీసుకెళ్లారు. గురువారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అయిజ: అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ ఉరి వేసుకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన అయిజలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం.. అయిజకు చెందిన నేసెమైల ఈశ్వర్(56) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ధీ క్రమంలో గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి కృష్ణవేణి పాఠశాల సమీపంలో పరమేష్ అనే వ్యక్తి కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో మెట్లకు ఉన్న ఇనుప కడ్డీలకు ఉరివేసుకొని మృతిచెందాడు. చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ఈశ్వర్‌కు భార్య ఇద్దరు, కుమారులు, కుమార్తె ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒకరికి జైలు శిక్షతో పాటు మరో ఏడుగురికి జరిమానా విధించింది. మహబూబ్‌నగర్‌లో ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాత్రి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.మద్యం తాగి వాహనాలు నడుపుతూ 8మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒకరికి మూడు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా, మిగిలిన ఏడుగురు వాహనదారులకు జరిమాన విధించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి ఎవరూ కూడా డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగడం ప్రమాదాలతో పాటు కుటుంబసభ్యులకు తీవ్ర నష్టం చేసిన వాళ్లు అవుతారని తెలిపారు.

ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు అరెస్ట్?

జడ్చర్ల: పట్టణంలో నకిలీ సర్టిఫికెట్లతో అక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరు ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లతో పాటు పలు ధ్రువీకరణ పత్రాలలో పుట్టిన తేదీ, వయసు, తదితర వివరాలను మార్చి వివిధ సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దృష్టి సారించి.. తనిఖీలు చేపట్టారు. ఇంటర్నెట్ సెంటర్లను నిర్వహించి ఇలాంటి తప్పిదాలు చేస్తున్నారన్న అభియోగంపై ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని సీఐ రమేశ్‌బాబు పేర్కొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి


జానంపల్లి వద్ద రోడ్డు పనులు

- మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి పనులు ముమ్మరం
- పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు

గండేడ్: మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఓ వైపు పనులు కొనసాగుతుండగా మరో వైపు ప్రమాదాలు సంఖ్య పెరుగుతంది. నిత్యం ఎక్కడో ఒక చోట వాహనాలు ఢీకొనడమో, అదుపుతప్పి పడిపోతున్నాయి. నెల రోజుల్లో గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలో ప్రమాదాల సంఖ్య పెరిగింది. ఇది వరకు డబుల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారి జాతీయ రహదారిగా మార్చారు. బెంగళూరు, ముంబాయి మధ్య ఉన్న జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా విస్తరించడానికి ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగానే రూ.703 కోట్లు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ గతేడాది సెప్టెంబర్‌లో నిధులు మంజూరు చేశారు. రాష్ట్రంలోని మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తున్న ఈరోడ్డును 167వ జాతీయ రహదారిగా గుర్తించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా భూత్పూరు నుంచి దుద్యాల వరకు 60 కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరించేందుకు రూ.440 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగానే నెలరోజులుగా పనులు ఊపందుకున్నాయి. దుద్యాల్ నుంచి కోస్గి, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, గండేడ్, కొంరెడ్డిపల్లి, నంచర్ల, మొకర్లాబాద్, మహమ్మదాబాద్ మీదుగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.

మితి మీరిన వేగం...

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ఒకప్పుడు చెట్లు అలుముకోవడంతో కనీసం కిలోమీటరు దూరంలో ఉన్న రోడ్డు సరిగా కనిపించేది కాదు. ప్రస్తుతం అవన్ని తొలగించడంతో కిలోమీటర్ల కొద్ది రోడ్డు కనిపిస్తుంది. ఫలితంగా వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గండేడ్, జానంపల్లి మధ్య ఇటీవల అధికంగా ప్రమాదాలు అయ్యాయి. రంగారెడ్డిపల్లి సమీపంలో గత నెలలో ఒకే రోజు రెండు ప్రమాదాలు, వరుసగా వారంలో నాలుగైదు ప్రమాదాలు అవడం విశేషం. మహమ్మదాబాద్ వద్ద కారు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. అంచన్‌పల్లి వద్ద వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో అంచన్‌పల్లికి చెందిన ఓ వ్యకి గాయపడ్డాడు. దీనికి తోడు దుమ్ము లేస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు.

■ మండలంలోని సల్కర్‌పేట్‌కు చెందిన ఆనంద్ 2వ తరగతి చదువుతున్నాడు. గత నెల 9వ తేదీ సాయంత్రం రోడ్డు దాటుతుండగా అతివేగంతో వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ ఇంత వరకు తెలియలేదు.

■ మంచిర్యాల మండలానికి చెందిన అభిలాష్, అతని స్నేహితుడు గండేడ్ మండల కేంద్రంలో అద్దెకు ఉంటూ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్నారు. ఏప్రిల్‌లో రాత్రి 11:30 గంటల ప్రాంతంలో కోస్గి వెళ్తూ.. రంగారెడ్డిపల్లి సమీపానికి రాగానే బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొన్నారు. తల పగలడంతో అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

రాకపోకలకు ఆటంకం..

రోడ్డును విస్తరించడానికి ఓ వైపు మట్టి పోస్తున్నారు. మరోవైపు లోతుగా తవ్వుతున్నారు. తవ్వినదాంట్లో కంకరపోసి తొక్కిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు సంకటంగా మారింది. అసలే బెంగళూరు నుంచి ముంబాయికి ఈ రోడ్డు దాదాపు 150 కిలోమీటర్ల మేర దూరం తగ్గడంతో వాహనాల రద్దీ చాలా ఎక్కువైంది. నిమిషం నిలకడ లేకుండా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల కల్వర్టుల నిర్మాణం చేస్తుండడంతో ప్రయాణానికి ఆటంకం కలుగుతుంది. పనులు చేసే ప్రాంతంలో అక్కడక్కడ సూచికలు ఏర్పాటు చేసినా పనులు ప్రారంభం అయ్యాకే ఎక్కువగా ప్రమాదాలు అవుతున్నాయి. కేబుల్ కోసం తవ్విన చోట ఎలాంటి సూచికలు లేవు.

స్టాపర్లు ఏర్పాటు చేశాం..



రోడ్డు పనులు ప్రారంభమయ్యాక ప్రమాదాలు పెరిగాయి. దీని నివారణకు అవసరమైన చోట స్టాపర్లు ఏర్పాటు చేశాం. మహమ్మదాబాద్, నంచర్ల, కొంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్, రంగారెడ్డిపల్లి వద్ద వీటిని ఉంచాం. మరికొన్ని తెప్పించి మిగతా గ్రామాల వద్ద ఏర్పాటు చేస్తాం. రోడ్డు కాంట్రాక్టర్లకు, కేబుల్ కాంట్రాక్టర్లకు కూడా చెప్పి పనులు చేసే చోట సూచికలు ఏర్పాటు చేయిస్తాం.

– సైదయ్య, ఎస్‌ఐ, మహమ్మదాబాద్


మొకర్లాబాద్ వద్ద ప్రమాదానికి గురైన రెండు డీసీఎంలు (ఫైల్)


అంచన్‌పల్లి వద్ద గాయపడ్డ వారికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది (ఫైల్)

అత్యాచార ఘటనలో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేశ్‌బాబు

- ఏడుగురు అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు

జడ్చర్ల: సామూహిక అత్యాచార ఘటనకు పాల్పడిన ఏడుగురు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేశ్‌బాబు విలేకరులకు వెల్లడించారు. మండలంలోని కోడ్గల్ గ్రామ శివారులో రవికుమార్‌కు చెందిన మలబార్ తోటలో ఏపీలోని గుంటూరు జిల్లా అచ్చంపేట ప్రాంతానికి చెందిన చెందిన లక్ష్మి నాలుగేళ్లుగా కూలీగా పనిచేస్తుంది. అలాగే జడ్చర్ల మండలం నెక్కొండకు చెందిన కాటమోని బాలస్వామి సైతం ఇదే తోటలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో బాలస్వామి, లక్ష్మి మధ్య కొంత చనువు ఏర్పడింది. రెండు నెలల కిందట లక్ష్మి అక్కడి నుంచి బాలానగర్ మండలం నేరళ్లపల్లి శివారులోని మరో తోటలో పనిచేసేందుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో తోటలో పనుల కోసం పల్నాడు ప్రాంతానికి చెందిన బంధువులు రమణమ్మ, రమేశ్ కలిసి లక్ష్మి దగ్గరకు వచ్చారు. తమకు బంగారు దొరికిందని, దానిని ఎవరికైనా అమ్మాలని లక్ష్మిని కోరారు. దీంతో లక్ష్మి బాలస్వామికి చెప్పింది. అప్పటికే తన దగ్గర భూమి అమ్మిన డబ్బులు ఉండడంతో తక్కువ ధరకు బంగారం వస్తుందని నమ్మిన బాలస్వామి రూ.2 లక్షలు ఇచ్చి అర కిలో నకిలీ బంగారు బిస్కెట్ తీసుకున్నాడు. బంగారు విక్రయం తర్వాత లక్ష్మి ఇక్కడి తోటలోనే పనులు చేసుకుంటుండగా రమణమ్మ, రమేశ్‌లు స్వగ్రామానికి వెళ్లిపోయారు. తర్వాత బాలస్వామి తాను కొనుగోలు చేసిన బంగారు బిస్కెట్‌ను పరీక్షించగా అది నకిలీగా తేలడంతో లక్ష్మిని నిలదీశాడు. తమను మోసం చేసిన వారిని ఎలాగైనా ఇక్కడికి రప్పించి డబ్బులు వసూలు చేసుకోవాలని భావించిన బాలస్వామి గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి రమేశ్‌కు ఫోన్ చేసి తమకు మరికొంత బంగారు కావాలని నమ్మబలికారు. దీంతో రమేశ్, రమణమ్మ, బయ్యా గంగమ్మతో కలిసి ఈ నెల 8న వచ్చారు. అదే రోజు బాలస్వామి, లక్ష్మి, నరేష్, శ్రీశైలం మార్గమధ్యలో కల్వకుర్తి సమీపంలోని జేపీ నగర్ దగ్గర వేచి ఉన్నారు. వారు బైక్‌పై రాగానే ముందస్తు పథకం ప్రకారంగా ఏర్పాటు చేసుకున్న స్కార్పియోలో రమేశ్, రమణమ్మ, గంగమ్మలను కిడ్నాప్ చేసి కోడ్గల్‌లోని తోటలో ఫాంహౌజ్‌కు తీసుకువచ్చి బంధించారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా రమేశ్ నిరాకరించడంతో బాలస్వామి మరికొందరు చితకబాదారు. అదే రోజు అర్ధరాత్రి సమయంలో ఒక గదిలో రమణమ్మపై బాలస్వామి, కుర్వ నర్సింహ అత్యాచారం చేయగా మరో గదిలో గంగమ్మపై కుర్వ వంశీ, శ్రీశైలంలు అత్యాచారం చేశారు. ఈ క్రమంలో రమేశ్ వారి నుంచి తప్పించుకుని గ్రామస్తులకు విషయం చెప్పి జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు అత్యాచారం జరిపిన వారితో పాటు ఘటనకు సహకరించిన లక్ష్మి, శేఖర్, కుమ్మరి గణేష్, ప్రవీణ్‌గౌడ్, డ్రైవర్ వంశీలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వీరిలో లక్ష్మి, డ్రైవర్ వంశీ పరారీలో ఉన్నారు. నిందితులకు సంబంధించిన మూడు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఖాదర్, సిబ్బంది పాల్గొన్నారు.

నదిలో దూకిన మహిళను కాపాడిన యువకులు

కృష్ణా: మండల కేంద్రంలోని కృష్ణానదిలో గురువారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను ఆ గ్రామ యువకులు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం లింగంపల్లికి చెందిన కుర్వ ఆశమ్మ తన కుటుంబ సభ్యులతో గొడవపడింది. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకోవాలని భావించి కృష్ణానదికి చేరుకున్నది. ఎవరూ లేరని భావించి నదిలోకి దూకింది. అటువైపు సాయంత్రం వాకింగ్ చేస్తున్న సుభాష్, రమేష్, దత్తు, లక్ష్మణ్ గమనించారు. వెంటనే నీటిలోకి దూకి ఆమెను కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రాధ మహాదేవ్ నది వద్దకు చేరుకుని ఆమె వివరాలు తెలుసుకున్నారు. వాహనంలో స్వగ్రామానికి పంపారు. ప్రాణాలతో కాపాడిన యువకులను సర్పంచ్ అభినందించారు.


కృష్ణానదిలో నుంచి మహిళను తీసుకొస్తున్న యువకులు

పాతకక్షలతో 'రియల్' వ్యాపారి హత్య

- హైదరాబాద్‌లో ఇంటివద్ద విచక్షణరహితంగా దాడి
- ఇనుపరాడ్లు, కత్తులతో పొడిచి పరారైన నలుగురు దుండగులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


దుండగుల దాడిలో మృతి చెందిన ఆశప్ప


ఆశప్ప అలియాస్ అశోక్ (ఫైల్)


అశోక్ నివాసం ఇదే..

కీసర: భూతగాదాలు, పాత కక్షల నేపథ్యంలో దాయాదులు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన గురువారం రాత్రినాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి ఆర్జీసీ కాలనీ టీపీఎస్ కాలనీలో చోటుచేసుకుంది. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... నారాయణపేట జిల్లా అభంగాపూర్‌కు చెందిన ఆశప్ప అలియాస్ అశోక(50) నాలుగేళ్ల క్రితం వ్యాపారరీత్యా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జీసీ కాలనీకి వచ్చి సొంతిల్లు కట్టుకొని రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి 7.20గంటల సమయంలో అశోక్ తన ఇంటి ముందు కూర్చొని ఉండగా గుర్తు తెలియని నలుగురు దుండగులు నంబర్‌ప్లేట్ లేని కారులో వచ్చి తమవెంట తీసుకొచ్చిన ఇనుప రాడ్లు, కత్తులతో ఆకస్మాత్తుగా అతడిపై విచక్ష రహితంగా దాడిచేశారు. చుట్టుపక్కల జనం అశోక్‌కుమార్‌పై జరుగుతున్న దాడిని చూసి ఒక్కసారిగా కేకలు వేయడంతో.. దాడికి పాల్పడిన నలుగురు దుండగులు పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంలో పడి ఉన్న అశోక్‌కుమార్‌ను కుటుంబసభ్యులు, స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రఘువీర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యుల వివరాలు సేకరించారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని, 2019 డిసెంబర్‌లో అతడిపై నారాయణపేట జిల్లా మరికల్ ప్రాంతంలో ఓ హత్యాయత్నం జరిగినట్లు తెలిసింది. అయితే ఈ హత్యకు భూవివాదాలు, లావాదేవీలే కారణం కావచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో దాడి చేసిన నారాయణపేటకు చెందిన ఆంజనేయులు, విజయ్‌కుమార్ ఈ హత్యకు ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రెండు రోజులుగా కాలనీలో నిందితులు రెక్కీ నిర్వహించి హత్య చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దించినట్లు త్వరలో అరెస్టు చేస్తామని డీసీపీ జానకి తెలిపారు.

గాలివాన బీభత్సం..

పెబ్బేరు: పట్టణంలో గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షం .. గాలి, ఉరుముల నేపథ్యంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న పెద్ద వృక్షాలు, సూచిక బోర్డులు, విద్యుత్ స్తంభాలు నేలకొరగగా.. పలు చోట్ల ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. దీంతో పాటు కంచిరావుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు గాలి దుమారంతో ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు కొట్టుకుపోతుండగా.. మరోవైపు వర్షానికి ధాన్యం తడిచింది.


నేలకొరిగిన విద్యుత్ స్తంభం


రంగాపూర్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం, సూచిక బోర్డు

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

మాగనూర్: మండల పరిధిలోని ఒబ్లాపూర్ స్టేజీ వద్ద గురువారం ద్విచక్ర వాహనం, టిప్పర్ ఢీకొన్న సంఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు... కర్ణాటకలోని యాపల్‌దిన్నెకు చెందిన ఈడిగి రాములుగౌడ్ భార్య కవిత, ముగ్గురు పిల్లలతో కలిసి మక్తల్ మండలం జక్లేర్‌లో వివాహానికి వెళ్తుండగా రోడ్డు క్యాంపునకు చెందిన టిప్పర్ ఒబ్లాపూర్ స్టేజ్ సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ ఒక్కసారిగా కుడివైపు తిరగడంతో బైక్ టిప్పర్‌కు వెనకాల ఢీకొంది. బైక్‌పై ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయాయి. స్థానికులు మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వనపర్తి: తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.70 వేల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన జిల్లాకేంద్రంలోని సాయినగర్‌కాలనీలో చోటు చేసుకుంది. వనపర్తి పట్టణ రెండో ఎస్‌ఐ రాము కథనం ప్రకారం.. రిటైర్డ్ జవాన్, ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్న గబ్బర్ సింగ్ బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులంతా ఇంటి తాళం వేసి ఊరు వెళ్లాడు. గురువారం ఉదయం తిరిగి ఇంటికి రాగా.. తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఏ డీకే మహేశ్వర్‌రావు, ఎస్‌ఐ రాము ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీడ్ డ్రిల్ విత్తు

- విత్తనం, ఎరువులు ఒకేసారి వేసుకొనే అవకాశం
- కూలీల సమస్యకు చెక్.. దిగుబడి ఆశజనకమే...


సీడ్ డ్రిల్ కమ్ ఫెర్టి డ్రిల్

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: జిల్లాలో రైతులు ఎక్కువగా విత్తనాలు వెదజల్లడం, నాగలి వెనుక సాళ్లలో విత్తనాలు వేసే పద్ధతులను అవలంబిస్తున్నారు. చిన్న కమతాల్లో అయితే సరే.. పెద్ద కమతాల్లో సాగుచేసే వారు యంత్రాలను వినియోగించడం మంచిది. ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్లర్లతో విత్తనాలు, ఎరువులు సమపాళ్లలో ఒకేసారి వేసుకోవచ్చు. దీంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు కూలీల సమస్యను అధిగమించవచ్చని అలంపూర్ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. సీడ్ డ్రిల్ యంత్రంతో సాగు పద్ధతులను ఆయన రైతులకు వివరించారు.

ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ఉపయోగాలు..

⇨ అన్నిరకాల విత్తనాలు నాటవచ్చు.

⇨ 8 గంటల్లో 6 నుంచి 8 ఎకరాల్లో విత్తనాలు విత్తుకోవచ్చు.

⇨ వర్షాధార భూముల్లో తేమ తగ్గకముందే సకాలంలో విత్తనాలు వేసుకొనే అవకాశం ఉంటుంది.

⇨ పంట ఆధారంగా వరుసలు, మొక్కల మధ్య దూరం మార్చుకోవచ్చు.

⇨ విత్తనంతో పాటు ఎరువులు వేయడంతో పంట తొలిదశలో ఆరోగ్యంగా పెరుగుతుంది. వేసిన ఎరువు మొక్కకు మాత్రమే అందడంతో ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి ఆరోగ్యంగా పెరుగుతుంది.

⇨ యంత్రాలతో వరి, వేరుశనగ, మొక్కజొన్న, పెసర, మినుము, కొమ్ము శనగ తదితర పంటలు వేసుకోవచ్చు.

⇨ యంత్రాన్ని వినియోగించే సమయంలో పొలం చదునుగా ఉండాలి.

⇨ చివరి దుక్కిలో రోటోవేటర్ ఉపయోగించాలి.

⇨ పొలం చదునుగా ఉంటే విత్తనం, ఎరువులు ఒకే మోతాదులో పడతాయి. ఒకేసారి మొలక శాతం వస్తోంది.

⇨ ప్రభుత్వం రాయితీపై యంత్రాలు అందజేస్తోంది.

పంటల వారీగా దూరం ఇలా.. (సెంటీమీటర్లలో..)

రకం	వరుసల మధ్య	మొక్కల మధ్య
వరి	25	15
మొక్కజొన్న	60	20
పామాయిల్	60	20
పెసర	25	10
గోగు	25-30	15
వేరుశనగ	30	15

సీడ్ డ్రిల్‌తో సాగు..

సీడ్ డ్రిల్ యంత్రంలో రెండు బాక్సులు ఉంటాయి. ముందు బాక్స్‌లో ఎరువులు, రెండో బాక్స్‌లో విత్తనం వేయాలి. ఎరువు ముందు పడుతుంది. తర్వాత విత్తనం పడుతుంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బాలానగర్: మండల కేంద్రం సమీపంలోని దుందుభీ వాగులో చేపల వేటకు వెళ్లి నీరటి శివయ్య(65) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ మేరకు శివయ్య కుమారుడు నీరటి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

జన సైనికులు, ఫ్యాన్స్‌కు పవన్ వెన్నుపోటు

రామ్ గోపాల్ వర్మ ట్వీట్



సాక్షి, అమరావతి: సొంత ఫ్యాన్స్‌నే కాకుండా, తన కాపుల్ని, తనని తానే జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్ వెన్నుపోటు పొడిచేసుకున్నారని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. ఆ రోజు ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన దానికన్నా దారుణంగా ఈరోజు పవన్ కళ్యాణ్ తన జన సైనికులను, ఫ్యాన్స్‌ని వెన్నుపోటు పొడిచి చంపేశారని గురువారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు.

ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 15కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–6) గజ్జల ఉదయ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ నెల 15కు వాయిదా వేసింది. ఈ కేసులో గతనెల 14న ఉదయ్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు అనుమతితో ఆరు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండు రోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సీబీఐ కోర్టు మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు డైరీని సీబీఐ సమర్పించింది. అనంతరం న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది.

సీఎం రేసులో లేను

టీడీపీతో పొత్తు ఖాయమని పవన్‌కల్యాణ్ సంకేతాలు

- సీఎం పదవి కావాలని అడగాలంటే ఆ స్థాయి ఉండాలి కదా అంటూ వ్యాఖ్యలు
- నాకు సీఎం పదవి ఇస్తానని టీడీపీ ఎలా చెబుతుంది?
- జనసేన బలం తెలిశాక టీడీపీ అధ్యక్షుడి స్థానంలో నేనున్నా ఆ మాట చెప్పను
- అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు: జనసేన అధినేత



సాక్షి, అమరావతి/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను అసలు ముఖ్యమంత్రి పదవి రేసులోనే లేనని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరోక్షంగా తేల్చి చెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం ఖాయమంటూ సంకేతాలిస్తూ, పొత్తుల్లో జనసేన పార్టీకే ముఖ్యమంత్రి పదవి కావాలని అడగడానికి ఓ స్థాయి ఉంటుంది కదా అంటూ వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ గురువారం మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు చర్చలు జరుగుతున్నాయి కదా, అవి ఎంతవరకు వచ్చాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'ఖచ్చితంగా పొత్తులు పెట్టుకుంటాం. మాట్లాడతాం. (బీజేపీని ఉద్దేశించి) కొంతమంది ఒప్పుకోకపోవచ్చు. ఒప్పిస్తాం. వాస్తవాలు, గణాంకాలు చూపి ఒప్పిస్తాం'.. అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల చంద్రబాబు–పవన్ భేటీ తర్వాత కొంతమంది జనసేన నేతలు మీరు తగ్గడం ఏమిటని, మీరు ముఖ్యమంత్రిగా అయితే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని, మీరు సీఎం అభ్యర్థిగా ఉండాలి కదా అని మాట్లాడడాన్ని పవన్ తప్పుబట్టారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

30–40 సీట్లు వచ్చి ఉంటే సీఎం పదవి అడిగే వాళ్లమేమో..

ముఖ్యమంత్రి స్థాయిలో ఉంటే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని అనేవాళ్లు ఎవరైనా సరే, అలాంటి ఆలోచనతో ఉంటే వారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. జనసేన గత ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేసింది. ఎన్ని గెలిచాం? పొత్తుల్లో ఇతర పార్టీలను సీఎం స్థానం కోసం డిమాండ్ చేయాలంటే కనీసం 30–40 స్థానాలు ఉండాలి. అప్పుడే ఆ వాదనకు బలం ఉండేది. ఇక తాను ఇప్పటివరకూ ఎవరికైనా పెద్దన్న పాత్ర వహించాలని చెప్పానంటే అది బాధ్యత వహించడం అని అర్థం. అంతేగానీ, ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమది.

నాతో నడిచే వాళ్లే నా వాళ్లు..

ఇప్పుడు మీరు మాట్లాడిన మాటలకు మీ అభిమానులు, జనసేన కార్యకర్తల నుంచే విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందేమోనని ఒక విలేకరి (సాక్షి కాదు) అన్నప్పుడు.. 'విమర్శలు వస్తాయని నాకు భయాలు లేవు. అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు. కార్యకర్తలైనా సరే.. నాతో నడిచేవారే నా వాళ్లు. అర్థంచేసుకునే వాళ్లు అర్థంచేసుకుంటారు'.. అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

సీఎం పదవి కావాలని కండిషన్లు పెడితే జరగవు..

ఒక మాట చెబుతున్నా.. పోయిన ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేశాం. 30–40 స్థానాల్లో కూడా గెలిపించలేకపోయారు. అలాంటప్పుడు మన వాదన (సీఎం పదవి కావాలనే)కు పస ఉండదు. సినిమా ల్లో నన్ను ఎవరూ సూపర్‌స్టార్ చేయలేదు. నేను సాధించుకున్నదే. రాజకీయాల్లో కూడా టీడీపీ కావొచ్చు. బీజేపీ కావొచ్చు.. నన్ను సీఎంను చేస్తామని ఎందుకంటారు. నేను టీడీపీ అధ్యక్షుడిని అయినా ఆ మాటలు అనను. మనం బలం చూపించి, సత్తా చూపించి పదవి తీసుకోవాలి. కండిషన్లు పెడితే, అవి జరగవు. సీఎం పదవి అన్నది తానై వరించాలి తప్ప నేను దాని కోసం వెంపర్లాడను. పొత్తులకు జనసేన పార్టీ పెట్టే కండిషను వైఎస్సార్‌సీపీని అధికారం నుంచి దించాలి అంతే. అలాగే, పొత్తులతో ప్రభుత్వం ఏర్పడాలి. నాదెండ్ల మనోహర్ మాట్లాడిన మాటలపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలి. ఓటు చీలనివ్వను అంటే ప్రధానంగా బలాలు ఏ పార్టీలకు ఉన్నాయో ఆ పార్టీలు కలవాలన్నది నా ఉద్దేశం. ప్రధాన పార్టీలకు సంబంధించే ఆ వ్యాఖ్యలు చేశాను. ఇక ఎన్నికలు ముందే వస్తాయని అనిపిస్తోంది. అందుకని జూన్ నుంచి రాష్ట్రంలోనే ఉండి పర్యటిస్తా.

చంద్రబాబు పల్లకీ మోయడమే పవన్ ఎజెండా

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- కాపుల ఓట్ల కోసం పవన్‌ను ఎరగా వేసిన చంద్రబాబు
- పవన్ చెబుతున్నట్లు ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు..



సాక్షి, అమరావతి/శంషాబాద్ (హైదరాబాద్) : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పల్లకీ మోయడమే తన ఎజెండా అని జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్ చాటి చెప్పారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో, తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలలో కులాల గురించి ఆలోచించడం తప్పని, అయితే చంద్రబాబు అదే చేస్తారని ధ్వజమెత్తారు. టీడీపీకి దూరమైన కాపు సామాజిక వర్గానికి పవన్ కల్యాణ్‌ను ఎరగా వేసి.. ఓట్లు రాబట్టాలని చంద్రబాబు పథకం వేస్తున్నారని ఆరోపించారు. కానీ.. ఆ పథకం చెల్లుబాటు కాదన్నారు. కులాలపరంగా ప్రజలు ఓట్లు వేయరని.. చేసిన సేవ, విశ్వసనీయత ఆధారంగానే ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో విజయం సాధించడం .. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడమే అందుకు నిదర్శనమని గుర్తు చేశారు. తాను సీఎం అయితే చూడాలనుకున్న అభిమానులు, కాపు సామాజికవర్గం కలలను చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టారన్నారు. తమ కలలను పవన్ కల్లలుగా మార్చిన నేపథ్యంలో అభిమానులు, కాపులు వారి వెంట నడవరని స్పష్టం చేశారు. చంద్రబాబు రాజకీయ కుతంత్రంలో పవన్ కల్యాణ్ ఇష్టపూర్వకంగా బలి పశువుగా మారారని చెప్పారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు కోసమే జనసేన

- సీఎం వైఎస్ జగన్ కంటే ముందే పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. చంద్రబాబు కోసమే జనసేనను స్థాపించారు. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు పలికారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా చంద్రబాబును అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో విడిగా పోటీ చేశారు.
- జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులను చంద్రబాబే ఖరారు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే ధ్యేయంగా పవన్ పని చేస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో సీఎం వైఎస్ జగన్‌లా ప్రజలతో మమేకమై.. వారి మన్ననలుపొంది, రాజకీయ శక్తిగా ఎదగాలని పవన్ ఎన్నడూ ఆలోచించ లేదు. తాను రాజకీయ శక్తిగా ఎదిగితే చంద్రబాబుకు ఇబ్బంది అవుతుందని పవన్ భావించారేమో.

ఒంటరిగా పోటీ చేసే సత్తా లేక..

- గత ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. గెలిచింది 23 స్థానాల్లోనే. జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లో గెలిచింది ఒక్క స్థానమే. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరిగా 175 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం నింపడానికే పొత్తులు అంటూ పవన్‌తో చంద్రబాబు మాట్లాడిస్తుంటారు.
- 2019 ఎన్నికల్లో 30 స్థానాల్లో గెలిపించి ఉంటే.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టేవాడినని పవన్ అనడం అవివేకం. జనసేన ఓటమి బాధ్యత ప్రజలపై వేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి పదవి రేసులో తాను లేనన్న పవన్.. మారీచులైన రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడులతో కలిసి చంద్రబాబును తక్షణమే సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే తన ధ్యేయమని చాటిచెప్పుకున్నారు.
- పవన్ చెబుతున్నట్టుగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు. ప్రభుత్వ సానుకూల ఓటు ఉంది. టీడీపీ తరఫున పోటీ చేయడానికే అభ్యర్థులు దొరకకే ముందస్తు ఎన్నికలంటూ బాబు డ్రామాలాడుతున్నారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం.

అప్పులంటూ అబద్ధాలా?

- ఆర్టిస్ట్ జీవీ రావుకు ఆర్థిక నిపుణుడి ముద్ర
- అలాంటి వ్యక్తి నోటితో బాబు కోసం తప్పుడు లెక్కలు వల్లె
- ఏపీ సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై ఈనాడు, దాని ఆర్థిక నిపుణుడు జీవీ రావు కథనం పచ్చి అబద్ధాలతో కూడుకున్నదని ఏపీ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపడ్డారు. ఎటువంటి గణాంకాలు లేకుండా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అంధకారం అయిపోయిందంటూ జీవీ రావు చేసిన వ్యాఖ్యలను నిర్ధారించుకోకుండానే ఈనాడు ప్రచురించడం తీవ్ర అభ్యంతరకరమని, దారుణమని ధ్వజమెత్తారు. ఎవరికీ పరిచయం లేని వ్యక్తిని ఆర్థిక నిపుణుడంటూ అర్థం లేకుండా మాట్లాడించి.. తప్పుడు కథనాన్ని అచ్చేయడం రామోజీరావు కుట్రలో భాగమని స్పష్టం చేశారు. గణాంకాలను చూపకుండానే రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ అయిపోయిందనడం తగదని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ఆర్‌బీఐ, కాగ్ గణాంకాలను పేర్కొంటూ అప్పులపై వాస్తవాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎవరు ఏం చెబితే అది రాసేస్తారా?

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడేళ్లుగా ప్రతిపక్షాలు, వాటి అనుబంధ మీడియా చేస్తున్న దుష్ప్రచారం కొనసాగింపులో భాగంగానే ఎవరికీ పరిచయం లేని వ్యక్తికి ఆర్థిక నిపుణుడనే ముద్ర వేసి నోటికి వచ్చినట్లు మాట్లాడించారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పించి, దాన్ని ఈనాడులో ప్రముఖంగా ప్రచురించారు. ఆర్థిక రంగంపై కనీస అవగాహన లేని ఒక చిన్న యాక్టర్ తప్పుడు విశ్లేషణను ఈనాడు బాధ్యతారాహిత్యంగా ఎలా ప్రచురిస్తుంది?
- అప్రకటిత రుణాలు తెచ్చారని జీవీ రావు చెబితే, కనీసం వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా ఈనాడు ఎలా రాస్తుంది? రూ. 10 లక్షల కోట్ల అప్పులు ఎక్కడున్నాయి? ఎవరు ఏం చెప్పినా, నిర్ధారించుకోకుండానే రాసేస్తారా? అలా రాయడం ఈనాడు దుర్బుద్ధి కాదా? లేక ఈనాడు రామోజీ రావే అలా అబద్ధాలు చెప్పించి, రాయించారా?
- ఆర్‌బీఐ, కాగ్ లెక్కల ప్రకారం బడ్జెట్, బడ్జెట్ బయట, ప్రభుత్వ పూచీ కత్తు, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులన్నీ కలిపి రూ.6,51,789.07 కోట్లే. రూ.పది లక్షలు కోట్లు అప్పులని చెప్పడం దుష్ప్రచారం కాదా? మరి మిగతా అప్పులు ఎక్క డున్నాయో ఆ నిపుణుడు, ఈనాడు చెబితే బాగుంటుంది. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే అవాస్తవ కథనాలు రాస్తుండటం నిజం కాదా?
- ప్రభుత్వానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డొమెయిన్‌లో ఉన్నాయి. వాటిని విశ్లేషించి, అవగాహనతో మాట్లాడితే స్వాగతిస్తాం. కానీ ఏ విశ్లేషణ చేయకుండా, ఎక్కడా లెక్కలు చెప్పకుండా తప్పుడు మాటలు మాట్లాడించి, ప్రచురించడం దారుణం.
- వృత్తిపరంగా అవకతవకలకు (ఒక కంపెనీ తరఫున ఆడిట్లో అవకతవకలు) పాల్పడటంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా జీవీ రావును రెండేళ్ల పాటు సస్పెన్షన్ చేసింది. అలాంటి వ్యక్తి ఆర్థిక నిపుణుడంటూ ఈనాడు తెరపైకి తెచ్చి తప్పుడు లెక్కలు చెప్పించడం కుట్రలో భాగమే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పేపర్లలో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేం

మార్గదర్శి పిటిషన్‌లో హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సీఐడీ అధికారులు చేస్తున్న తనిఖీలపై పత్రికల్లో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి తనిఖీలు జరిపితే.. సంస్థ రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సీఐడీని ఆదేశించింది. తనిఖీల పేరిట రోజువారీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని మార్గదర్శి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీపీ ఏబీ లలితా గాయత్రి వాదనలు వినిపించారు. తనిఖీల సమయంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించడంలేదని చెప్పారు. చట్ట ప్రకారమే తనిఖీలు జరిగాయన్నారు. పారదర్శకంగా సాగుతున్న దర్యాప్తును అడ్డుకునేందుకు మార్గదర్శి ఇప్పటికే పలు పిటిషన్లు వేసిందన్నారు. పత్రికలో ఏవో ఫొటోలను ప్రచురించి ఖాతాదారులను అడ్డుకుంటున్నామని చూపించే యత్నం చేస్తోందని తెలిపారు. అలాంటి ఫొటోలను, ప్రచురణలను పరిగణనలోకి తీసుకోవద్దని కోర్టును కోరారు. ఏపీలో నమోదవుతున్న కేసులపై ఈ కోర్టు నుంచి ఉపశమనం పొందాలని భావిస్తోందని తెలిపారు. పరిధి లేని పిటిషన్లను విచారణకు స్వీకరించవద్దని, పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు.

నవోదయలో ఇంటర్మీడియట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022– 23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 31 వరకు ఎలాంటి రుసుం లేకుండా www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంలో ఏమైనా సవరణలకు జూన్ 1 నుంచి జూన్ 23 వరకు చేసుకోవచ్చని, జూలై 23న పరీక్ష ఉంటుందన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



సురేష్ యాదవ్ (ఫైల్)

అడ్డాకుల: ఇంటర్ పరీక్షలో ఫెయిలయ్యానని మనస్తాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపాడు. ఈ సంఘటన మూసాపేట మండలం పోల్కంపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు వివరాల ప్రకారం... బైకని రాజమల్లి, సుజాత దంపతులకు సురేష్‌యాదవ్(18)తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల సురేష్ ఇంటర్ పరీక్షలు రాయగా రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీనికి మనస్తాపానికి గురై బుధవారం కుటుంబసభ్యులు బయట ఉండగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డా డు. కొంత ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యు లు సురేష్‌ను వెంటనే అన్నాసాగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు చెప్పడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. సురేష్ మృతితో కుటుంబంలో తీరని విషాదం ఏర్పడింది. ఒక్కగానొక్క కొడుకు ప్రాణా లు తీసుకోవడంతో తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెల్లు తల్లడిల్లారు. బంధువులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే జన్మ సార్థకం



మాట్లాడుతున్న పీఠాధిపతి సిద్ధలింగేశ్వర మహాస్వామి

మక్తల్: ప్రతివ్యక్తి ఆధ్యాత్మిక చింతనతో ఉన్నప్పుడే జన్మ సార్థకమవుతుందని పశ్చిమాద్రి మఠం నేరడుగం పీఠాధిపతి సిద్ధ లింగేశ్వరమహాస్వామి అన్నారు. గురువారం మండలంలోని మాద్వార్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి నూతన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కర్ణాటక ప్రాంతం గవ్వారం మఠం పీఠాధిపతి సద్గురు సోపానాథ్‌స్వామి మహరాజ్, బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి వీరభద్రస్వామి, సిద్ధ లింగేశ్వరమహాస్వామి ప్రతిష్ఠించారు. హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం, గోమాతకు పూజలు, పాలాభిషేకం, హోమం కార్యక్రమాలు జరిపారు. ప్రతిఒక్కరు భక్తిమార్గంలో నడుచుకుంటూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలన్నారు. దైవభక్తి అలవర్చుకుంటే మనిషి సన్మార్గంలో పయనిస్తాడన్నారు. గ్రామాల్లో యువకులు భక్తి మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆలయాలను సందర్శించడం పూర్వజన్మ సుకృతం అని అభివర్ణించారు. ఆలయ నిర్మాణానికి, విగ్రహాల ప్రతిష్ఠాపనకు సహకరించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేంద్రచారి, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఇందిర, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, నాయకులు సంతోష్‌రెడ్డి, నరేందర్, బ్రహ్మయ్య, బాలరాజు, సత్యనారాయణ, కృష్ణయ్య, విశ్వనాథ్, మోనయ్య ఆంజనేయులు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ స్వీపర్‌కు ఇల్లు నిర్మించడం అభినందనీయం



స్వీపర్ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, స్టేషన్ సిబ్బంది

పాన్‌గల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న బాలరాజుకు దాతల సాయంతో ఎస్ఐ నాగన్న ఇల్లు నిర్మించి ఇవ్వడం అభినందనీయమని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటిని సందర్శించారు. ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్‌కు ఇల్లు లేదని తెలిసి పెద్దమనసుతో సాయమందించడం గొప్పవిషయమన్నారు. ఆర్థిక తోడ్పాటునందించిన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కొత్తపేట గ్రామంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు ఉండాలి

ప్రజలతో పోలీసులు సత్సంబంధాలు కలిగి ఉండాలని వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐ మహేశ్వర్ రావు అన్నారు. గురువారం స్వీపర్ బాలరాజు నూతన ఇంటిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్టేషన్‌లో ఏళ్లుగా ఉంటున్న బాలరాజుది పేద కుటుంబం కావడం, తండ్రి లేకపోవడం, ఉండేందుకు సరైన ఇల్లు లేకపోవడం గమనించిన ఎస్ఐ నాగన్న అన్నీ తానై మూడు గదులతో ఇంటిని నిర్మించి ఇవ్వడం అభినందనీయమన్నారు. విధులతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. ఇంటి నిర్మాణంలో ఆర్థిక తోడ్పాటునందించిన ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాముయాదవ్, జ్యోతినందన్‌రెడ్డి, తిరుపతయ్యసాగర్, ఎస్ఐ నాగన్నను శాలువా, పూలమాలలతో సన్మానించారు. వెంకటయ్య నాయుడు, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయక్, సర్పంచ్‌లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి

బిజినేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వ్యవసాయంతోపాటు ఇతర ఆదాయ మార్గాలను ఇచ్చే వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ, పెరటి కోళ్ల పెంపకం, పాడి పోషణ వంటి పలు రకాలను ఆదాయం అందించే వాటిపై దృష్టిపెట్టాలని పాలెం కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పాలెం కేవీకేలో గిరిజన ఉప పథకం కింద గిరిజన రైతులకు పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంతో పెద్దఎత్తున మాంసం, గుడ్లు, కోడి పిల్లలను తయారీ చేపట్టాలని, వ్యవసాయాన్ని సంప్రదాయ పద్ధతులనే కాకుండా వ్యాపార దృక్పథంలో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు, పాల్గొన్నారు.



ఉత్పత్తి వృత్తులను చాటింది తెలుగు కవులే



మాట్లాడుతున్న ప్రొ. భుజంగరెడ్డి

బిజినేపల్లి: పంటలు పండించి ఈ దేశానికి అన్నం పెట్టిన రైతన్నల గొప్పతనం, ఇతర చేతివృత్తుల గురించి ప్రపంచానికి తెలుగు కవులే చాటి చెప్పారని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొ.భుజంగరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో తెలుగు సాహిత్యంలో ఉత్పత్తి వృత్తులు– అధ్యయనం అనే అంశంపై కళాశాల ప్రిన్సిపల్ డా. పెబ్బేటి మల్లికార్జున్ రెండో రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ ఈ సమాజానికి ఉత్పత్తి వృత్తి వారు పౌష్టిక ఆహారాన్ని అందించారని, వస్త్రాలను, నాగలిని, కర్రను, కుండలు, ఆభరణాలు, కలప తయారీ వస్తువులను, ఇళ్లు, రాజ భవనాలు, దేవాలయాలు, కోటలు, శిల్పాలు, ప్రాజెక్టులు అందించారన్నారు. అలాగే ప్రపంచీకరణ వలన నష్టపోయిన వృత్తికారుల గురించి కూడా బాదాతప్త రచనలు చేశారని విశ్లేషించారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా విద్యాధికారి శివార్చక విజయ్‌కుమార్, పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డా.కృష్ణ, మైసూర్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు వేంకటేశ్వర్లు, కళాశాల సీపీడీసీ మెంబర్ గాడి సురేందర్, బీసీటీఏ జిల్లా అధ్యక్షులు భాస్కర్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి



జూరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇథనాల్ వ్యతిరేక పోరాటసమితి నాయకులు

ఆత్మకూర్: చిత్తనూర్, హిందూపూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలని ఆలిండియా కుల, అసమానతల పోరాటసమితి జాతీయ కన్వీనర్ బండారి లక్ష్మయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 15న మక్తల్ కేంద్రంలో జరుగు ధర్నాకు తరలిరావాలని రైతులను, ప్రజలకు పిలుపునిచ్చారు. మక్తల్ నియోజకవర్గంలోని చిత్తనూర్, హిందుపూర్‌లో ఏర్పాటు చేస్తున్న కెమికల్ ఈథనాల్ ఫ్యాక్టరీల ద్వారా కృష్ణానది, రామన్‌పాడ్, జూరాల ప్రాజెక్టులు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీరు కలుషితమై, పంటలు పండబోవని అన్నారు. పీల్చేగాలి కూడా కలుషితమైతుందని అన్నారు. ఇథనాల్ వ్యతిరేక పోరాటసమితి నాయకులు చిట్యాల శ్రీనివాస్, మధు, అలీసాబ్ ఉన్నారు.

అవయవదానంతో మరొకరికి ప్రాణదానం



ఆకుల లక్ష్మణ్ (ఫైల్)

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన ఆకుల లక్ష్మణ్(38) చనిపోతూ తన అవయవాలను ఇతరులకు దానం చేసి, పలువురి ప్రాణాలు నిలిపాడు. ఈ సందర్భంగా మృతి చెందిన లక్ష్మణ్, అవయవదానానికి ఒప్పుకున్న కుటుంబ సభ్యుల నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఖిల్లాఘనపురానికి చెందిన ఆకుల లక్ష్మణ్ అడ్డాకుల మండలం వేముల వద్ద ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల ఖిల్లాఘనపురం నుంచి కంపెనీ వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వేముల వద్ద జాతీయ రహదారిపై ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు తెలిపారు. ఈ సమయంలో అవయవాలు దానం చేస్తే మరో నలుగురు బతుకుతారని, వారిలో లక్ష్మణ్ బతికే ఉంటాడని వైద్యులు తెలియజేయడంతో మృతుని కుటుంబ సభ్యులు భార్య ప్రమీల, తల్లి సత్యమ్మ ఒప్పుకున్నారు. అతని కళ్లు, గుండె, కాలేయం, కిడ్నీలను వైద్యులు మరికొందరికి అమర్చారు. అనంతరం మృతదేహాన్ని గురువారం గ్రామానికి తెచ్చి అంతిమకార్యం నిర్వహించారు. లక్ష్మణ్‌కు తల్లితో పాటు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.



గుట్ట నుంచి మట్టిని తరలించడంతో ఏర్పడ్డ గోతులు

'మట్టి తరలింపుపై చర్యలు తీసుకోండి'

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తి సమీపంలో కేఎల్ఐ కాల్వ మట్టిని అనుమతి లేకుండా నిరంతరం తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై గ్రామానికి చెందిన బండి చెన్నయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోవడం లేదని చెప్పారు. 8 టిప్పర్లు, జేసీబీ సాయంతో రోజుకు 50 నుంచి 70 ట్రిప్పుల వరకు కేఎల్ఐ కాల్వ నుంచి మట్టి తోడి నాగర్ కర్నూల్‌కు తరలిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై బండి చెన్నయ్య తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, అక్రమార్కులపై చర్యలు తీసుకుండా వారి చేత పోలీసుస్టేషన్‌లో తనపై ఫిర్యాదు చేయించినట్లు బాధితుడు వాపోయాడు. తాజాగా గురువారం నాగర్‌కర్నూల్ ఆర్డీఓకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసిన స్పందన లేదన్నారు. రెవెన్యూ అధికారులు అక్రమంగా మట్టిని తరలించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.